# కవిరాయడు - మహారాజు

చింతా దీక్షితులు బి. ఏ. ఎల్. టి, సాహితీసమితి సభ్యుడు

## ౧

ఒకనాటి ప్రాతఃకాలమున కవిరాయడు స్వప్నావస్థనుండి మేల్కొన్నాడు. బాహ్యప్రపంచవైఖరి అతనికి గోచరమైనది. నిజస్థితి యతని మనస్సునకు తట్టినది. ఖిన్నుడై పోయినాడు!

మహారాజునకు తనపై దయతప్పినదని యాతడు గ్రహించినాడు!

## ౨

కవిరాయడు కవి కుటుంబమున బుట్టినాడు. కవి గర్భమున జన్మించినాడు. ఆతడు పుట్టినప్పుడు కోకిలలు కూసినవి, చిలుకలు పలికినవి, మోడు చెట్లు చిగిరించినవి!

లోకమంతయుకవిరాయనికిస్వాగతము చెప్పినది.

కవిరాయని జనకుడు తన హృదయమును ఆ సమయమున పరిశీలించి చూచికొన్నాడు. కవితారసమునకు బదులు ఆనందరసము హృదయమున నిండియుండుట గమనించినాడు. ఆనంద బాష్పములతో తనకు బుట్టిన కవిరాయని నొక్కమారు తలచుకొని "మహారాజునకు కృతిగా నొసగగల, నాకడసారి ప్రబంధ మీతడే గదా!" అనుకొన్నాడు. తన చిన్నప్రబంధమును, ఈ కవిరాయని మహారాజు చేతిలో బెట్టి జనకుడు నిద్రావస్థను బొందినాడు.

## ౩

మహారాజు రాజ్యభారమున మునిగి తేలుచున్నాడు. ఎయ్యది మంచి, ఎయ్యది చెడ్డ-అను విషయమును నిర్ణయించుకొనుటలో కాలము జరిగిపోవుచున్నది. ప్రజలను శాసించుచున్నాడు, పన్నులు గొనుచున్నాడు. ఉపదేశవాక్యములను మహర్షుల వదనపబుల నుండి వినుచున్నాడు. రాజ్యపరిపాలనము కష్ట సాధ్యమైన పని అనుకొనుచున్నాడు. అప్పుడప్పుడు మహారాజు చెవులలో కవులగీతములు పడుచుండుటకూడకలదు. అవి ఈర్ష్యాగీతములో, ప్రణయగీతములో ఆమహారాజు ఎట్లు నిర్ణయించుకొనగలడు? కవిజనకుడర్పించిన కుమార ప్రబంధమును మహారాజు ఎక్కడనో పెట్టి మరచిపోయినాడు?

## ౪

కవిరాయుడు చిన్ననాటి చెలిమికాంద్రతో దృఢమైత్రి చేసికొని ప్రపంచమును మరచిపోయినాడు.

చిలుకలతో జట్టుకట్టి తీయని పలుకులను నేర్చుకొన్నాడు.

కోయిలలతో సంచారముచేసి పలుకులకు మంజులత్వ మలవడజేసికొన్నాడు.

గోదావరి నాశ్రయించి స్వేచ్ఛాగాన మభ్యసించినాడు.

ఆతని నివాసము ఎల్లప్పుడు కొండలమీదను చెట్ల మీదను.

ఆతని దృష్టులెల్లప్పుడు ఆకాశ:థమున నక్షత్రమ డలములపైపే.

ఈసహవాస ఒలముచేత కొంతకాలము పాట పాడుటే మరచిపోయినాడు కవిరాయడు.

సహవాసులప్రోద్బలముచేత కొంతకాలమునకు గీతములను పాడుట మొదలుపెట్టినా డాతడు.

ప్రకృతి గీతములు, ప్రణయగీతములు! చిలుకలు,కోకిలలు ఆతని గీతములు మెచ్చుకొన్నవి.

ఇంతవరకును ప్రజలు రంగు బొమ్మలను మెచ్చుకొనువారు. సజీవగీతములను చూచి వారు మూకీభావము వహించినారు.

కవిరాయని వంశము వారందరు మహారాజునకు కృతులిచ్చినవారే.

కవిరాయడు చిలుకలకును, కోయిలలకును తనతొలిచూలి బిడ్డ నర్పించినాడు!

మంచి సావాసము చేయుచుండలేదని మహారాజు కవిరాయని మరచినాడన్నారు కొందరు! చిలుకలకును కోయిలలకును కృతియిచ్చుట తగని పనిగా గణించి కోపమందియుండవచ్చునని మరి కొందరన్నారు!

నిజస్థితి మాత్ర మెవ్వరికిని తెలియలేదు.

౫

మహారాజునకు తనపై దయతప్పినదని తెలిసికొని కవిరాయడు ఖిన్నుడై దుఃఖగీతములుపాడ మొదలుపెట్టినాడు. లోకమునావరించియున్న దుఃఖసముద్రములో నవి లీనమై పోయినవి.

కొంత కాలమునకు తెలివితెచ్చుకొని మహారాజుపై గీతములల్లినాడు కవిరాయడు. మహారాజున కందచేయుదునని చెప్పి వాయువా గీతములను తనగర్భములో దాచుకొన్నది.

మరల క్రొత్తగీతముల నాతడు పాడినాడు. మహారాజున కందచేతుమని చెప్పి చిలుకలు గీతములను దాచి వేసినవి.

క్రొత్తకృతుల మరల నాతడు కల్పించినాడు. ఈమారు కోయిలలాకృతులను మహారాజునకంద జేతుమని చెప్పి పుచ్చుకొని ఎక్కడకో లేచిపోయినవి.

తన చిన్ననాటి సహవాసులు తనపై కినుక వహించిన సంగతు గ్రహించినాడు. చిన్ననాటి సావాసగాండ్రను పూర్తిగా మరచినాడు. లోకమునంతను పూర్తిగా మరచినాడు. తన దృష్టి మహారాజుపై నిల్పి ఎంతో విశ్వాసముతో నాతని దన హృదయపీఠమున నిల్పుకొన్నాడు.

"ధనదేవత నుపాసించుచున్నావా" యని చిలుకలు గేలిచేసినవి.

"మేము లేని గీతములు గీతములా" యని కోయిలలు పరిహాసించినవి.

"వంశగౌరవమును కాపాడుకొనవలెను సుమా" యని స్వప్నములో కవిజనకు డాదేశించినాడు.

కవిరాయని దృష్టిమాత్రము చెదరలేదు. ఒకటే లక్ష్యము—అది మహారాజే.

కవిరాయునికి యౌవనము వచ్చినది.

మహారాజునకు దయకలుగలేదు.

౬

ధ్యానముద్రలో కొంతకాలముండి తరువాత మహారాజుపై మరలగీతములు వ్రాయ మొదలు పెట్టినాడు కవిరాయుడు.

సొంతముగా వీనిని తాను కృతియీయ దలుచుకొన్నాడు మహారాజునకు.

మహారాజుదర్శనము కవిరాయునికి కలుగలేదు.

తన వంశీయుల పూర్వకృతులలో గలిపి తన కృతులను గూడ గొంతెత్తిపాడ మొదలు పెట్టినాడు కవిరాయుడు.

మహారాజు కార్యభారమున నుండుటచే ఆతని చెవుల బడలే దివి.

గీతముల సంఖ్య నానాటికి హెచ్చి పోవుచున్నది. పాటలు నిరతము పాడుటచే కవిరాయుని గొంతు బొంగురుపోవుచున్నది.

మహారాజు కార్యనిమగ్నుడై యున్నాడు. కవిరాయునికి నిరాశ ఎక్కువగుచున్న కొలది మహారాజుపై విశ్వాసము అధికము కాజొచ్చినది.

తాను రచియించిన గీతముల నన్నింటిని లోకములో ప్రచారార్థమై వదలిపెట్టినాడు కవిరాయుడు.

లోకములోనివారు గీతములను పఠించినారు.

"మహారాజు హృదయము వజ్రశకల" మన్నారు కొందరు.

"కవిరాయడు ప్రకృతిని వదలిపెట్టిన తరువాత స్తోత్రపాఠములను వ్రాయుచున్నాడుగాని గీతములను వ్రాయుటలేద" న్నారు కొందరు. "సత్కార్యమునకు కవిరాయడు ఫలము నాశించుటతప్ప" న్నారు కొందరు.

"వంశాచారమును వదలించుకొనుట ఎవ్వరితర" మని కొందరన్నారు.

కవిరాయునికి లోకముపై కోపము పుట్టినది. మనస్సున కొకవిగ్రహము కల్పించుకొని తాను రచించిన కృతుల నన్నింటిని దానికి కృతి యీయ మొదలుపెట్టినాడు.

ఆవిగ్రహమే మహారాజన్నాడు కవిరాయుడు.

ఎంతోకాలము గడిచినది.

మహారాజు తల నరసినది, ఒడలు ముడుతలు పడినవి. రాజ్యభారము నానాటికి అతిశయించుచున్నది.

కవిరాయునికి దృష్టి మందగించినది. చేతులు వణకుచున్నవి. కంఠము రుద్ధమైనది. గీతములను పాడుచునే యున్నాడు.

మహారాజునకు కవిరాయునిపై అనుగ్రహము కలుగలేదు.

కవిరాయునికి మహారాజుపై విశ్వాసము తగ్గలేదు!